క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీని తిలకిస్తున్న సోమన్న చౌదరి తదితరులు

రంగంపేట: మండలంలోని మర్రిపూడిలో ఎంఎస్ఎస్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ మొదలైంది. సుమారు 32 జట్లు పాల్గొంటున్న ఈ పోటీలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు అందిస్తామని నిర్వాహకులు బొలిశెట్టి తమ్మారావు, వడిశల శ్రీను, దూడిపూడి నాని తెలిపారు. మర్రిపూడి యువ క్రికెట్ క్రీడాకారులు మణికంఠ, సత్యానందం, సూరిబాబు జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తొలి మ్యాచ్ మేడపాడు, మల్లంపూడి జట్ల మధ్య జరిగింది.

40 లీటర్ల సారా స్వాధీనం



దాడిలో పట్టుబడిన సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ చైతన్య మురళీ ఆదేశాల మేరకు శనివారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. మర్రిపూడిలో 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ సందర్భంగా వేము వెంకటరమణ, దాసరి దుర్గారావు, మట్ట శ్రీనుపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

వ్యవసాయ పనిముట్లను వినియోగించుకోవాలి



రైతుకు పవర్ టిల్లర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: రాయితీపై అందజేస్తున్న వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన 8 పవర్ టిల్లర్లు, నాలుగు బ్యాటరీ స్ప్రేలను శనివారం ఆయన పంపిణీ చేశారు. మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, పెద్దాడ సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీనువాస్, మాజీ సర్పంచ్ సింగినీడి నాగ తిరుపతిరావు పాల్గొన్నారు. కరకుదురులోని వేణుగోపాలస్వామి ఆలయంలో సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన కల్యాణ, ముఖ మంటపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ వుండ్రు చంద్రకళ, ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల సత్తా

- మంచి మార్కులు సాధించిన విద్యార్థులు
- అభినందించిన అధ్యాపకులు



లీలా శ్రావణి 943 (సీఈసీ)



పాలమూరి దేవి 926 (ఎంపీసీ)



వీర హాసిని 969 (ఎంపీసీ)



మాధవి 961 (బైపీసీ)



దుర్గాప్రసాద్ 901 (సీఈసీ)



సోహిత 925 (హెచ్ఈసీ)



దివ్య 449 (ఎంపీసీ, ప్రథమ)



నాగలక్ష్మి 427 (బైపీసీ, ప్రథమ)



లోవరాజు 462 (సీఈసీ, ప్రథమ)

బిక్కవోలు: ఇంటర్మీడియెట్ ఫలితాలలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలోని పడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రభుత్వ మహిళ కళాశాల ద్వితీయ ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పాలమూరి దేవి 926 (ఎంపీసీ), ఆర్.లీలా శ్రావణి 943 (సీఈసీ) మార్కులు సాధించినట్లు పందలపాక ఉన్నత పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

- బిక్కవోలు ప్రభుత్వ కళాశాల సీఈసీలో 16 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వారిలో ఒక్కరు మాత్రమే ఉత్తీర్ణత సాధించారని బిక్కవోలు ఉన్నత పాఠశాల హెచ్ఎం పళ్లా వీర ప్రభాకర్ తెలిపారు.

రంగంపేటలో..

రంగంపేట: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం 86 మంది విద్యార్థులకు 65 మంది (75 శాతం), ప్రథమ సంవత్సరానికి సంబంధించి 123 మందికి 62 మంది (50 శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఎస్.వీర హాసిని 969 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. సీహెచ్.మాధవి బైపీసీలో 938, ఏపీ దుర్గాప్రసాద్ సీఈసీలో 901, దేవిన సోహిత హెచ్ఈసీలో 925 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఎస్.దివ్య ఎంపీసీలో 449, కె.శ్రీనాగలక్ష్మి బైపీసీలో 427, డి.లోవరాజు సీఈసీలో 462, పి.దుర్గా ప్రసాద్ హెచ్ఈసీలో 317 మార్కులు సాధించారన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ హేమ, అధ్యాపకులు కృష్ణమూర్తి, రమణ, పద్మావతి, కృష్ణ అభినందించారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించామని సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిక్కం దొరబాబు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 163 మంది పరీక్షలకు హాజరవ్వగా, 68 మంది విద్యార్థులు (42 శాతం) పాసయ్యారన్నారు. సెకండియర్ 93 మంది రాయగా, 65 మంది ఉత్తీర్ణతులయ్యారన్నారు. ఒకేషనల్ గ్రూపులకు సంబంధించి బి.మోహన్ 948 (ఎంఅండ్‌టీ), టి.కిరణ్ కుమార్ 874 (సీఈటీ), సీహెచ్ దేవి 823 (ఓఏఎస్), జనరల్ గ్రూపులకు సంబంధించి వై.ప్రసన్న తేజస్విని 887 (ఎంపీసీ), ఆళ్ల క్రాంతి 881 (సీఈసీ), బి.లలితా దేవి 869 (బైపీసీ) మార్కులు సాధించి ఆయా గ్రూపుల్లో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

- వెదుళ్లపల్లి వుమెన్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 13 మంది హాజరవ్వగా ఏడుగురు ఉత్తీర్ణత సాధించారని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం ఎల్.సీతారత్నం తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 32 మందికి 17 మంది విద్యార్థులు పాసయ్యారన్నారు. వారిలో ముగ్గళ్లకు చెందిన గంగుల విజయలక్ష్మి 454 మార్కులతో మండల ప్రథమం సాధించిందన్నారు. నరమామిడి సంధ్యాదేవి 412, ఉమ్మిడిశెట్టి అనూష 401 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం



రాజానగరంలో కురుస్తున్న వర్షం

రాజానగరం: ఎండలు మండిపోతున్న సమయంలో ఈదురుగాలులతో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీనివల్ల కొంత ఉపశమనం కలిగినా జనజీవనం స్తంభించింది. గంటకు పైగా కురిసిన వర్షంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. కార్ల అద్దాల నుంచి ముందు దారి కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. రాజానగరంలో పలుచోట్ల ప్రకటనల ఫ్లెక్సీలు చిరిగిపోయి, బోర్డులు నేలకొరిగాయి. అయితే ఈదురు గాలుల వల్ల మామిడి, జీడిమామిడి తోటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి తీరని లోటు

కోరుకొండ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవులకు తీరని లోటని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మాణిక్యం అన్నారు. పశ్చిమగానుగూడెం సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో శనివారం ప్రవీణ్ పగడాల ఆదరణ కూడిక జరిగింది. యునైటెడ్ క్రిస్టియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ కృపా విల్సన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కూడికలో ఆయన సందేశాన్నిచ్చారు. మండలంలోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల ఫ్లెక్సీలు ధ్వంసం

- మిర్తిపాడులో విష సంస్కృతి
- ధర్నాకు దిగిన పార్టీ శ్రేణులు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



మిర్తిపాడు సెంటర్‌లో దుండగులు ధ్వంసం చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు (అంతర చిత్రం) ఫ్లెక్సీల పక్కనే పడి ఉన్న మద్యం సీసాలు

సీతానగరం: ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు అత్యంత కీలకంగా ఉంటాయి. అధికారం చేపట్టినా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల తరఫున పని చేస్తాయి. ఒక పార్టీని ఇంకోటి గౌరవించుకుంటూ ముందుకు సాగుతాయి. ఇంత గొప్ప విధానాన్ని కొందరు నాశనం చేస్తున్నారు. సీతానగరం మండలం మిర్తిపాడులో జరిగిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల ధ్వంసం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ మండల అధ్యక్షుడు ఉప్పులూరి సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా మిర్తిపాడు సెంటర్‌లో ఈ నెల 10న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్ ఫొటోలతో మూడు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం రాత్రి కొందరు మద్యం తాగి, ఆ సీసాలను పగలగొట్టి, వాటితో ఆ మూడు ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. అక్కడే మిగిలిన పార్టీల ఫ్లెక్సీలు సురక్షితంగా ఉన్నాయి. కేవలం వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలనే ధ్వంసం చేయడం గమనార్హం. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం 5 గంటలకు టెంట్ వేసి నిరసన తెలిపారు. అలాగే ధర్నా నిర్వహించారు. ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, పార్టీ నాయకులు నల్లా శ్రీను, మాకిరెడ్డి సాయి కల్యాణ్, నడిపల్లి హరీష్, పోతిరెడ్డి వినాయకుడు, పోతిరెడ్డి ఏసయ్య, గోశాల మహేష్, విత్తనాల శాంసన్ విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 21న మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే, వాటిని ధ్వంసం చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న కోరుకొండ ఇన్‌చార్జి సీఐ శ్రీధర్, ఎస్సై డి.రామ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని టెంట్ తొలగించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులతో చర్చలు జరిపి, ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కాగా.. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబుతో కలిసి మిర్తిపాడు పార్టీ నాయకులు, కార్యకర్తలు సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రామ్‌కుమార్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు.



ఎస్సై రామ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎంప్లాయీస్ విభాగం అధ్యక్షుడిగా ఈశ్వరుడు



సీతానగరం: వైఎస్సార్ సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా చిన కొండేపూడికి చెందిన పోలినాటి ఈశ్వరుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయన శనివారం ఉత్తర్వులు అందాయి. ఈశ్వరుడు నేషనల్ సీడ్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ సీడ్ ఆఫీసర్‌గా 1985 నుంచి ఉద్యోగ బాధ్యతలు ప్రారంభించారు. అసిస్టెంట్ మేనేజర్‌గా 2020 జూన్‌లో ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం ఆయన వైఎస్సార్ సీపీకి ఎనలేని సేవలు అందించారు. ఈ సందర్భంగా ఈశ్వరుడు మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. ఈశ్వరుడును ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్ రాజు, సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి వలవల వెంకట్రాజు (తోటలో రాజు), సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) తదితరులు అభినందించారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ



సీపీఆర్ శిక్షణ ఇస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కార్డియోపల్మనరీ రిససిటేషన్(సీపీఆర్)పై ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యాన శిక్షణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు పి.ప్రశాంతి తెలిపారు. రాజమహేంద్రవరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో శనివారం ప్రథమ చికిత్స శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రథమ చికిత్సపై ఇక నుంచి నెలకు రెండుసార్లు శిక్షణ ఇస్తామని, ఆసక్తి ఉన్నవారు 96763 22350 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి శిక్షణ పొందటం వలన అకస్మాత్తుగా గుండె ఆగిన వారికి సీపీఆర్ చేయడం ద్వారా విలువైన ప్రాణాలు కాపాడగలుగుతామని వివరించారు. రెడ్‌క్రాస్ క్రియాశీలక సభ్యులు డాక్టర్ జీఎస్‌వీఏబీఎస్ మహాలక్ష్మి మాట్లాడుతూ జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ ప్రశాంతి సూచనల మేరకు ప్రథమ చికిత్సపై విద్యా సంస్థల్లో ఉచిత అవగాహన సదస్సులు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ పాగోటి రాంబాబు, సభ్యుడు కేవీ రమణ, ప్రథమ చికిత్స శిక్షకులు చిన్ని సత్యనారాయణ, పద్మ పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

బాధితులకు జక్కంపూడి రాజా పరామర్శ

కడియం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం కడియం మండలంలో పలువురిని పరామర్శించారు. భార్యావియోగంతో బాధపడుతున్న తూపాటి చిన్నను బుర్రిలంకలో పరామర్శించారు. కడియపులంకలో తిరుమలశెట్టి మంగాయ్యమ్మ మృతికి సంతాపం తెలిపారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పార్టీ నాయకులు నందపునీడి గంగారావు, ముద్రగడ మహేష్‌లను దామిరెడ్డిపల్లిలో వారి నివాసాలకు వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొత్తపల్లి శివాజీ, మూర్తి, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, మాజీ ఎంపీటీసీ బుడ్డిగ వీర వెంకట్రావు గౌడ్ తదితరులు ఉన్నారు.



మంగాయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం



కానిస్టేబుల్ నాగదుర్గకు సీమంతం చేస్తున్న పోలీస్ సిబ్బంది

కడియం: స్థానిక పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ నాగదుర్గకు శనివారం తోటి సిబ్బంది సీమంతం చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్సైలు నాగదుర్గాప్రసాద్, ధనలక్ష్మి ప్రసన్న, హెచ్‌సీలు సురేష్‌బాబు, వెంకటరమణ, శ్రీనివాస్, ప్రశాంత కుమార్, సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందుడు

- గోవుల ఆకలి తీర్చుతున్న టీస్టాల్ యజమాని
- 13 ఏళ్లుగా మేత, నీరు అందజేత
- తన ఆదాయంలో వాటికి కొంత కేటాయింపు



ఆవుదూడకు గడ్డి తినిపిస్తున్న శివకుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అతను పెద్ద మోతుబరి కాదు, చిన్న టీ స్టాల్ నిర్వాహకుడు, కానీ మనసున్న మహారాజు. 13 ఏళ్లుగా టీస్టాల్ వద్దకు వస్తున్న గోవులకు పచ్చగడ్డి వేయడంతో పాటు దాహార్తిని తీర్చుతున్నాడు. అలాగే టీస్టాల్ వద్దకు వచ్చే కుక్కలకు సైతం ప్రతిరోజు పాలు పోయడం పరిపాటిగా చేసుకున్నాడు. టి.నగర్‌లోని శివ టీస్టాల్ యజమాని శీలంకి శివకుమార్ సేవా నిరతి ఇది.

టీ స్టాల్ నిర్వాహకుడు

రాజమహేంద్రవరానికి చెందిన శీలంకి శివకుమార్ టి.నగర్‌లోని యూనియన్ బ్యాంక్ రోడ్డులో టర్నింగ్‌లో 30 ఏళ్లుగా టీస్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. 13 ఏళ్ల క్రితం టీ స్టాల్ ఎదురుగా చెట్టు కిందకు ఆవులు, ఆంబోతులు, దూడలు వచ్చి చేరుతుండేవి. అయితే అవి ఆకలితో అలమటిస్తుండడంతో పాటు దాహంతో బాధపడడం చూసి శివకుమార్ చలించిపోయాడు. అప్పటి నుంచి ప్రతి రోజూ ఆవుల కోసం 20 పచ్చగడ్డి మోపులు కొనుగోలు చేస్తున్నాడు. వాటిని టీస్టాల్ దగ్గర ఉంచి, ఆవులు వచ్చిన తర్వాత వాటికి మేతగా వేస్తున్నాడు. దాహార్తిని తీర్చేందుకు ఒక చిన్న కుండీని ఏర్పాటు చేసి అందులో ప్రతిరోజు నీరు పోస్తున్నాడు.

నెలకు రూ.12 వేల ఖర్చు

ప్రతి రోజూ ఉదయం యజమానులు వదిలేసిన తర్వాత తొమ్మిది గంటల కల్లా టీస్టాల్ వద్ద చెట్టుకు కిందకు గోవుల చేరతాయి. సాయంత్రం వరకు అక్కడే ఉండి మళ్లీ యజమానులు వద్దకు చేరతాయి. గోవులతో షాపు వద్ద ఉండే కుక్కలకు సైతం రాత్రి సమయంలో శివ పాలు పోస్తాడు. గోవులు, కుక్కల కోసం ప్రతి నెలా సుమారు రూ.12 వేల వరకూ ఖర్చు పెడుతున్నట్లు టీ స్టాల్ నిర్వాహకుడు శివ కుమార్ తెలిపారు. ఆయన సేవలను స్థానికంగా ఉండే ఆటో డ్రైవర్లు, షాపుల యజమానులు, వర్కర్లు అభినందిస్తున్నారు.

13 ఏళ్లుగా గడ్డి వేస్తున్నాను

టీస్టాల్ ఎదురుగా ఉన్న చెట్టు వద్దకు వచ్చే గోవులకు ప్రతి రోజూ పచ్చగడ్డి వేస్తున్నాను. దాదాపు 13 ఏళ్లుగా ఈ పని చేస్తున్నాను. ప్రతి రోజూ 20 పచ్చగడ్డి కట్టలు ఉదయాన్నే తీసుకువచ్చి షాపులో పెట్టుకుంటా. కుండీలో నీరు పోసి నింపుతాను. రాత్రి సమయాల్లో కుక్కలకు పాలు పోస్తాను. తనకు వచ్చిన ఆదాయంలో కొంత ఇలా సేవకు వినియోగించడం ఆనందంగా ఉంది.

– శివకుమార్, టీ స్టాల్ నిర్వాహకుడు, రాజమహేంద్రవరం

కనుల వైభవం.. ఆధ్యాత్మిక సంబరం

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామ దేవతల జాతర, తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అలాగే శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని పలు కార్యక్రమాలు జరిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితుల సందడితో ప్రతి ఇల్లూ కిటకిటలాడింది.

- వైభవంగా అమ్మవార్ల జాతరలు
- ఆలయాల్లో పూజలు
- తరలివచ్చిన భక్తులు



చింతాలమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రఘుదేవపురం గ్రామ దేవత చింతాలమ్మ సిరిమానోత్సవాన్ని శనివారం కొలగారం, గ్రామ రైతుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 5 గంటలకు గుమ్మడి కాయ, ఉపవాసం ఉన్న వ్యక్తి, మచ్చలేని నల్ల మేకను సిరిమానుకు కట్టి తిప్పడంతో భక్తులు పుష్పాలు, పండ్లను వాటిపైకి విసిరి తమ భక్తిని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, పార్టీ నాయకులు పిండి రాధాకృష్ణ, పట్టపగల విష్ణు ప్రసాద్, పైడి రాజు, యలమాటి కాశీ, ఏపుగంటి సత్తిబాబు, యలమాటి సురేష్, పంతుల శ్రీను, పంతుల బుజ్జి పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

పెదపూడి: పెదపూడి గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. వారి కోసం ఆలయ ఆవరణలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. గ్రామ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి, భక్తులకు తాగునీరు సరఫరా చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చేవా సత్యనారాయణ, మాదిరెడ్డి రామకృష్ణ, రిమ్మలపూడి సీతయ్య, రిమ్మలపూడి సత్యనారాయణ, కాకర సురేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోదండ రాముని శ్రీపుష్పయాగం

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని కోదండ రామాలయంలో శుక్రవారం రాత్రి సీతారాముల శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ఉయ్యాల సేవ, పవళింపు సేవను పండితులు నిర్వహించారు. ముందుగా స్వామివారికి మంగళస్నానాలు చేయించారు. అద్దాల శయన మందిరంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు.

వేణుగోపాలస్వామికి లక్ష తులసి పూజ

వేండ్ర గ్రామంలో కొలువైన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి లక్ష తులసి పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి వార్షిక కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు పౌర్ణమి కంకణాల పూజ సందర్భంగా తులసి పూజ చేశారు. అలాగే శ్రీ చక్రస్నానం చేయించారు. వైఖనస పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో 12 మంది వేద పండితులు పూజలు చేశారు. అర్చకుడు సుదర్శన సత్యకృష్ణమూర్తి ఆచార్యులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంపరలో పోలేరమ్మ తీర్థం

సంపర గ్రామంలో పోలేరమ్మ తీర్థం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా.. అమ్మవారి జాతర శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది.

ఘనంగా అమ్మవారి తీర్థాలు

బిక్కవోలు: కొమరిపాలెంలో కనకదుర్గమ్మ తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే ఊలపల్లిలో శుక్రవారం రాత్రి సోమాలమ్మ జాతర, శనివారం తీర్థం నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు మొక్కుబడులు సమర్పించారు.



పెదపూడిలో మహాలక్ష్మమ్మ



జి.మామిడాడలో ఉయ్యాల సేవ చేస్తున్న అర్చకులు



వేండ్రలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి



కొమరిపాలెంలో కనకదుర్గమ్మ



ఊలపల్లిలో సోమాలమ్మ